కార్తీక మాసం వేళ.. గోదావరి రేవు ఇలా..

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రాజుల్లంక గ్రామంలో స్నానాల రేవు అధ్వానంగా మారింది. కనీసం రేవులోని చెత్తా చెదారం కూడా తొలగించలేదు. ఈ కారణంగా ఈ రేవులో స్నానాలు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్తీకమాసం నేపథ్యంలో ఇక్కడే ఎక్కువ మంది గోదావరి స్నానం చేస్తుంటారు. అధికారులు స్పందించి రేవును శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న స్నానాల రేవు

కొండపై నివేదిక ఇవ్వండి

- లక్ష్మి నరసింహస్వామి 50 ఎకరాలు తిరిగి తెస్తాం
- దేవాలయ అభివృద్ధికి రూ.4.50 కోట్లు కేటాయింపు
- మూడు నెలల్లో ఇక్కడ రోడ్లు పూర్తి
- అధికారులు మెతగ్గా ఉంటే కుదరదు
- ఉచిత గ్యాస్ దీపం-2లో డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్
- భారీకేడ్ల ఏర్పాటుపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

గత ప్రభుత్వ హాయాంలో లక్ష్మినరసింహస్వామి ఆలయం వద్ద కొండ తవ్వకం ఎవరు సాగించారో.. ఎంత దోచేశారో.. హైవే నిర్మాణానికి వాడారో.. లేదో తేల్చి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు చెప్పానని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఉచిత గ్యాస్ దీపం-2 పథకాన్ని ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. విమానంలో హైదరాబాద్ నుంచి రాజమండ్రి చేరుకున్న డిప్యూటీ సిఎం అక్కడ నుంచి రోడ్డు మార్గంగుండా 12.15 గంటలకు ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి చేరుకున్నారు. నేరుగా కొండపై ఉన్న లక్ష్మినరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ హోమంలో పాల్గొనిదర్శనం చేసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎలు, అధికారులతో విడివిడిగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. దీనికి మీడియాను అనుమతించలేదు. అంతర్గత సమాచారం మేరకు దేవాదాయ అధికారుల సమావేశంలో దేవాలయ భూముల పరిరక్షణ గురించి పలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దేవాదాయ ఆస్తుల రక్షణకు వక్ఫ్‌బోర్డు తరహాలో కార్యాచరణ చేపట్టే యోచన చేస్తున్నట్లు ఆయన చెప్పినట్లు సమాచారం. దాదాపు 60 వేల ఎకరాల ఎండోమెంట్ ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు అధికారుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అన్యాక్రాంతమైన ఆస్తుల జాబితాను తయారు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. రెండు గంటలకు సభ అని షెడ్యూల్ ఇచ్చినప్పటికీ 3.30 గంటలకు గుడి దిగువన ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. ఉదయమే అక్కడకు చేరుకున్న జనం, అధికారులు ఉక్కబోతకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో చాలామంది నీరసించారు. గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షతన జరిగిన సభలో తొలుత మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ఈ ఆలయానికి వచ్చానని తెలిపారు. ఇక్కడి లక్ష్మి నరసింహ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా ముఖ మండపం, గాలిగోపురం నిర్మాణానికి రూ.2.50 కోట్లు, రక్షణ గోడ నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల మాదిరిగా శక్తివంతమైన కేంద్రంగా మారుస్తామన్నారు. లక్ష్మి నరసింహ ఆలయానికి 50 ఎకరాలు భూమి ఉందన్నారు. ఆ భూమి చిక్కులో ఉందని, ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కొండ కింద భాగం నుంచి పైభాగం వరకూ రోడ్డు వేసేందుకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడకు వచ్చేందుకు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం నుంచి వచ్చే రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. మూడు నెలల్లో ఇవి పూర్తి చేస్తామని అధికారులు చెప్పినట్లు తెలిపారు. కొయ్యలగూడెం మీదుగా ఐఎస్ జగన్నాథపురం వచ్చిన ఆయన మధ్యలో రోడ్డు బాగోలేకపోవడంతో దిగి నడిచారు. దీంతో రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులు వైసిపి హాయాంలో అడ్డగోలుగా వెళ్లారు. ఇప్పుడు ధర్మబద్ధంగా పని చేయమంటే వెనుకాడుతున్నారని అన్నారు. బారికేడ్ల ఏర్పాటుపై అప్పట్లో వైసిపిపై జనసేన, టిడిపి తీవ్ర విమర్శలు చేసింది. పవన్ పర్యటనలో పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చివరిలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించారు. పవన్ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్‌తోపాటు ఎంఎల్ఎలు, అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

గ్యాస్ పంపిణీ వాహనానికి పచ్చ జెండా ఊపుతున్న పవన్‌కళ్యాణ్

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్ రాక

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం భీమవరం రానున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులయ్యాక ఆయన తొలిసారి భీమవరంలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం ఏడు గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నుండి బయలుదేరి లోసరి మీదుగా ఉదయం 10:30 గంటలకు భీమవరం మల్టీప్లెక్స్‌లోని శ్రీ అల్లూరి శ్రీరామరాజు ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు. అనంతరం కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కూటమి నేతలు, ఎంఎల్ఎలతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం కలెక్టరేట్‌కు చేరుకుని వివిధ అంశాలపై సమీక్షిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు భీమవరం నుండి బయలుదేరి తాడేపల్లి వెళ్లనున్నారు.

8 నుండి ప్రజాపోరు

14న మండల కేంద్రాల్లో, 15న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల ఎనిమిదో తేదీ నుండి 15వ తేదీ వరకు 'ప్రజాపోరు-ఇంటింటికీ సిపిఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. స్థానిక మెంటేవారి తోటలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం శుక్రవారం చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమానికి సిపిఎం పిలుపునిచ్చిందన్నారు. 14న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు, 15న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు, రవాణా వాహన యజమానులు, తాపీ కార్మికులు, ర్యాంపుల్లో బంటా కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మద్యం దుకాణాల్లో అమ్మకాలు విచ్చలవిడిగా సమయపాలన లేకుండా సాగించడంపై విచారం వ్యక్తం చేశారు. మద్యాన్ని నియంత్రించాల్సిందిపోయి ఆదాయ వనరుగా చూసి ఏరులై పారించాలనుకోవడం దారుణమన్నారు. ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పెట్టిన దుకాణాలకు అనుమతులను రద్దు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని వ్యతిరేకించారు. ట్రూఅప్ ఛార్జీల పద్ధతిని, స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చేశారు. పంట నష్టం అందజేతలో కౌలురైతులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే సమగ్ర సర్వే చేసి వాస్తవ సాగుదారులకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్ల మరమ్మతులు, నిర్మాణం తక్షణం చేపట్టి ప్రమాదాలు నివారించాలన్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లాలో డంపింగ్ యార్డులు, శ్మశాన, ఇతర సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. నీటి, వాయు కాలుష్యం, ఆహారంలో కల్తీ విపరీతంగా పెరిగిపోవడం వల్ల ప్రజలు విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా వంటి వాటి బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో తగినన్ని వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు ప్రయివేటు వైద్యానికి లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని, వెంటనే ప్రభుత్వాసుపత్రులను, వైద్యాన్ని బలోపేతం చేయాలన్నారు. అన్ని వ్యాధులకు రోగ నిర్ధారణ టెస్టులను ప్రభుత్వాసుపత్రుల్లో చేయాలని, అత్యవసర చికిత్స అందించాలని, ఎక్కడికక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై సిపిఎం ప్రజాపోరు కార్యక్రమం చేపట్టిందన్నారు. 14న మండల కార్యాలయాల వద్ద, 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాల్లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జెఎన్‌వి.గోపాలన్, కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

1న పింఛన్ల పంపిణీ ఘనత కూటమి ప్రభుత్వానిదే

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దేశంలో అత్యధికంగా పింఛన్ల సొమ్ము అందిస్తున్న రాష్ట్రం మనదేనని, అలాగే ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో శుక్రవారం ఆయన పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛన్‌దారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి దీపావళి కాకరపువ్వొత్తులు కాల్చారు. లబ్ధిదారులకు పింఛను సొమ్మును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే 29 వేల మంది లబ్ధిదారులకు రూ.12.12 కోట్ల పెన్షన్ల సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రం మీద రూ.14 లక్షల కోట్ల అప్పుల భారం పెట్టినా, ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ సొమ్ము అందిస్తుందన్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుకు కూడా జీతాలు ఒకటో తేదీనే అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు జీతాలు పెంచమని మాట అటుంచి, జీతాలు ఒకటో తేదీనే ఇవ్వండి మహాప్రభో అనేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరరావు, నాయకులు కోడి విజయభాస్కర్, బోనం చినబాబు, మామిడిశెట్టి పెద్దిరాజు, పాలవలస తులసీరావు, బందెల భాస్కరరావు, కోటి వీరభద్రరావు, పాముల రజినీకుమార్, ఇంటి శ్రీరాములు, పెన్మెత్స శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

పలు పనులకు శంకుస్థాపనలు

మండలంలోని కాపవరం, వాలమర్రు, అరట్లకట్ట గ్రామాల్లో రూ.కోటీ 80 లక్షలతో సిమెంటు రోడ్లు, తాగునీటి ట్యాంకుల అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి, శిలాఫలకాలను జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశలవారీగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తీరతామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇలు పి.శ్రీనివాసరావు, కలవకొలను దుర్గారామస్వామి, సిహెచ్.వెంకట నారాయణ, రామాయణం త్రిమూర్తులు, జి.వెంకటరత్నం, సర్పంచులు రుద్రరాజు శ్రీనివాసరాజు, కోలాటి రాధ, గంటా సత్యనారాయణ, ఎంపిటిసిలు చింతపల్లి సాయిబాబు, యాండ్ర శైలజ కుమారి, నాయకులు పాల్గొన్నారు.

ఉండి: సామాజిక పింఛన్లు పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం ఎన్‌ఆర్‌పి అగ్రహారం ఎస్‌సి కాలనీ చర్చి ప్రాంతంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, కొంతమంది లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ సొమ్ము అందజేసి వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ మీకు ఎప్పటి నుండి పెన్షన్లు వస్తున్నాయని, ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందిస్తున్నారా అంటూ పింఛనుదారులను అడిగి తెలుసుకున్నారు. పసుపులేటి సూర్యకిరణ్, కె.జగన్నాథం, దుర్గాశివప్రసాద్ తాము పూర్తిగా వికలాంగులమైనా మెడికల్ పెన్షన్ కింద రూ.15 వేలు అందడం లేదని, రూ.ఆరు వేలు మాత్రమే అందుతుందని, రూ.15 వేలు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతానికి పింఛన్ల సైట్ అప్డేషన్‌లో ఉందని, తిరిగి ప్రారంభం కాగానే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్, పెన్షన్ల ఎపిఒ టి.మురళీకృష్ణ, డిఎస్ఒ ఎన్.సరోజ, తహశీల్దార్ కె.నాగార్జున, ఎంపిడిఒ రవీంద్ర, ఇఒపిఆర్‌డి రెడ్డి, కార్యదర్శి జెవిటి.నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలి : జెసి

పాలకోడేరు: ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మోగల్లు గ్రామ సచివాలయం-1 పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్ ఒకటో తేదీనే నూరుశాతం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్‌దారులు ఎవరూ ఇబ్బంది పడకుండా అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందించాలని ఆదేశించామన్నారు. ఒక్క మోగల్లు సచివాలయం-1 పరిధిలో వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు 606 పెన్షన్లు పంపిణీ చేశారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 2.33 లక్షల మంది లబ్ధిదారులకు రూ.96 కోట్లు ఉదయం నుండి అందించినట్లు తెలిపారు. జెసి వెంట తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డియ్య, గ్రామ సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి, సివిల్ సప్లయిస్ డిటి జి.ఆదిశేషయ్య, సచివాలయం కార్యదర్శులు సుజాత, వీరమల్లు మహాలక్ష్మి, విఆర్ఒ పి.సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.



పింఛను అందజేస్తున్న మంత్రి నిమ్మల

రేషన్ పంపిణీలో అవకతవకలుంటే కఠిన చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకోడేరు: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మోగల్లులో 25, 28 నెంబర్ రేషన్ షాపులను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ కాటా తూకాన్ని పరిశీలించారు. పంపిణీలో అవకతవకలు జరగకుండా, ఒక్క ఫిర్యాదూ రాకుండా సకాలంలో పంపిణీ జరగాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా తక్షణం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చౌక ధరల దుకాణం షాపులో స్టాక్ రూమ్, రిజిస్టర్‌లను పరిశీలించారు. రిజిస్టరులో ఉన్న స్టాకు ప్రకారం రూమ్‌లో ఉన్న స్టాకును లెక్కించారు. కందిపప్పు, పంచదార రేట్లు సరుకుల బోర్డుపై ఉంచాలన్నారు. పిడిఎస్ బియ్యం, నిత్యావసర సరుకులను అక్రమంగా అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మోగల్లు- కోరుకొల్లు రహదారి పక్కన పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వారి ఇంటిని పరిశీలించి ఇంటి పన్ను కడుతున్నారా అని ఆరా తీశారు. అధికారుల నుండి కట్టడం లేదని సమాధానం రావడంతో లేఅవుట్‌లో స్థలం కేటాయించి ఆక్రమణ తొలగించాలని ఆదేశించారు.

ఉచిత ఇసుక ఇవ్వాలని ధర్నా

ఇరగవరం: ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎం.సుందరరామరాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ గత ఐదు నెలలుగాఇసుక లేక భవన నిర్మాణాలు ఆగిపోయాయని, దీనివల్ల కార్మికులు ఉపాధిని కోల్పోయారని అన్నారు. దీనికితోడు నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణమూర్తి, తిరుపతి సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసు, చిన్న, నాగరాజు, జుత్తిగ రామాంజనేయులు, మామిడిశెట్టి నరసింహమూర్తి, బడేటి భాస్కరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దింపు కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని వినతి

ప్రజాశక్తి - తణుకు

దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దింపు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తణుకు కార్మిక శాఖాధికారి బి.లక్ష్మణ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది దింపు కార్మికులు చేతి వృత్తులపై ఆధారపడి స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. దింపు వృత్తి ప్రమాదకరమైందని, చెట్టు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రమాదాలు జరిగి మృతి చెందడం, శాశ్వత వికలాంగులు కావడం జరుగుతుందని, వారిని ప్రభుత్వం ఆదుకోవడం లేదని విమర్శించారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు, శాశ్వత వికలాంగులైతే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 45 సంవత్సరాలు దాటిన వారికి రూ.5 వేలు పెన్షన్ మంజూరు చేయాలని, సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జె.మహాలక్ష్మీ, జోగి సత్యనారాయణ, కోమటి వెంకటేశ్వర్లు, జన్ని ప్రసాద్, చేబ్రోలు అయ్యప్ప, కె.సురేష్, మెంటయ్య పాల్గొన్నారు.

'మతోన్మాద శక్తులకు అడ్డుకట్ట వేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం

మతోన్మాద శక్తులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని, లేకపోతే సమాజంలో మత చిచ్చు రగిలే ప్రమాదం ఉందని నరసాపురం క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు యతిరాజుల రూబెన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌పేటలో ఫెయిత్ హోమ్ చర్చి ప్రాంగణంలో పలువురు పాస్టర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకొల్లు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి జిల్లాలోని క్రైస్తవ సంఘాల వివరాలను తెలుసుకునేందుకు ఆర్‌టిఐ యాక్టు కింద దరఖాస్తు చేశారన్నారు. దీన్ని సాకుగా చూపి అధికారులు ప్రతి చర్చి వద్దకూ వచ్చి సంఘ వివరాలను సేకరించారన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ విధంగా సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. ఇది క్రైస్తవ సోదరులకు ఎంతో బాధ కల్గిస్తుందన్నారు. కొన్ని మతోన్మాద శక్తులు అన్నదమ్ముల వలె కలిసి ఉన్న ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. లేనిపక్షంలో క్రైస్తవ సంఘాలన్నీ ఏకమై న్యాయపరంగా పోరాడతామని హెచ్చరించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రోడ్డు నిర్మాణం రీత్యా బస్సుల మళ్లింపు

ఆర్‌టిసి నరసాపురం డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు నుండి పాలకొల్లు, పెనుగొండ నుండి పెరవలి వరకు మధ్యలో కొన్ని చోట్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం రీత్యా ఆర్‌టిసి బస్సులను దారి మళ్లించినట్లు నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కార్గో కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నరసాపురం నుంచి రాజమండ్రి వెళ్లే బస్సులు వయా పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు వంతెన, ఆలమూరు, మార్టేరు మీదగా నడుస్తున్నాయని, విశాఖపట్నం, విజయనగరం బస్సులు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. నరసాపురం నుంచి తణుకు వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు వంతెన, ఆలమూరు, కంతేరు, ఇరగవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. కమలాపురం, అశ్వారావుపేట, ద్వారకాతిరుమల, సత్తుపల్లి బస్సులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తాయని వివరించారు. నిడదవోలు వైపు వెళ్లే బస్సులు పాలకొల్లు నుంచి లంకలకోడేరు, ఆలమూరు, మార్టేరు, పెనుగొండ, వడలి, సిద్ధాంతం, ఖండవల్లి, పెరవలి మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

వైద్య కళాశాలలకు యల్లాప్రగడ పేరుపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విశ్వ విఖ్యాత వైద్య శాస్త్ర పరిశోధకులు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు మన భీమవరంలో జన్మించడం అందరికీ గర్వకారణమని, ఎన్నోఏళ్లుగా ఆయన పేరు వైద్యరంగ నిర్మాణాలకు పెట్టాలని కోరుతూ వస్తున్నామని, ఇన్నాళ్లకు ఆ కల సాకారమైందని డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నందమూరి రాజేష్, చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును గోదావరి జిల్లాల్లో నిర్మించే వైద్య కళాశాలకు పెట్టాలని ప్రతిపాదించడం, దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలపడం శుభ పరిణామమని అన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నేత మెంటే పార్థసారథి మాట్లాడుతూ డాక్టర్ యల్లాప్రగడ శతజయంతికి పోస్టల్ స్టాంప్ భీమవరంలో విడుదల చేశామని గుర్తు చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొండాడ రామ్మోహన్‌రావు, ఐఎంఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ గంధం విశ్వేశ్వరరావు, యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి మట్లపూడి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, దుక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ, సహకార సంఘాల అధికారులు, మండల లెవెల్ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో రైతులు వరి కోతలు మొదలు పెడితే ఆవిషయాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులకు తెలపాలన్నారు. ఆ రైతులకు సంబంధించి ధాన్యం కొనుగోలుకు ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనడం జరుగుతుందన్నారు. జిల్లాలో అందరూ ఎంఎడొలు అన్ని రైతు సేవ కేంద్రాల పరిధిలో కనీసం 20 శాతానికి తగ్గకుండా గోనె సంచులను నిల్వ ఉంచాలన్నారు. దీనికి సంబంధించి తహశీల్దార్లు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట కోత షెడ్యూలు తయారు చేసుకుని ఎప్పటికప్పుడు కావాల్సిన గోనె సంచులను వాహనాల ద్వారా రవాణా చేసుకునేందుకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సివిల్ సప్లయిస్ డిఎం, డిఎస్ఒ, మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీలో వారికి ఇచ్చిన టార్గెట్ ప్రకారం తెప్పించాలని తెలిపారు. నియోజకవర్గాల స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, ఆచంట, తణుకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ

ప్రజాశక్తి - ఆచంట

మాదకద్రవ్యాలు, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా యువత కృషి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంవిఆర్ జూనియర్ కళాశాల వద్ద డివైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం - యువతను కాపాడుకుందాం' అనే అంశంపై విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడి చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేశ ప్రగతికి, అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న మాదకద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలపై యువతీ, యువకులు, విద్యార్థులు అవగాహనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు తమరాపు దుర్గాప్రసాద్, ఉన్నమట్ల ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ఎస్‌సి, ఎస్‌టి కూలీలకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధి హామీలో షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన కూలీలకు పని కల్పించడంలో ప్రాధాన్యతివ్వాలని ఎంపిడిఒ కిరణ్‌కుమార్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్షా సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. జిల్లాలో వీరవాసరం మండలంలోని ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించడంలో వెనుకబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో 100 రోజుల పని దినాలకు దగ్గరగా ఉన్న కూలీలకు పని కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే సమావేశానికి హాజరుకాని ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమో ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

ప్రజాశక్తి - గణపవరం

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం సిహెచ్ అగ్రహారంలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే నిర్వహించుకోవాలన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వస్తాయన్నారు. తలపోటు, చలిజ్వరం వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్ఎం జి.పద్మ, మంగేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రజకులకు తక్షణం రక్షణ చట్టం అమలు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వేల్పూరు గ్రామంలో రజక వృత్తిదారుల సమావేశం మీసాల రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మడకా రాజు మాట్లాడుతూ రజక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులను అరికట్టేందుకు రజక రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు యండమూరి నాగేంద్ర మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారునికీ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలన్నారు. సబ్సిడీ ధరపై బొగ్గు, సర్ఫ్, సబ్బులు వంటి ముడి సరుకులివ్వాలని కోరారు. 50 శాతం సబ్సిడీపై రెండు లక్షల చొప్పున షూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీసాల నరసింహమూర్తి, ధనరాజు, నాగరాజు, రాంపండు, నాని, అన్నవరం, హరి, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రేలంగిలో సిపిఎం మండల మహాసభ

ప్రజాశక్తి - తణుకు

సిపిఎం 6వ మండల మహాసభ ఈనెల 2వ తేదీన ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో జరగనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కామన మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభల్లో సిపిఎం ప్రజల పక్షాన పనిచేసిన విధానాలను, భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలను చర్చిస్తారని మునిస్వామి తెలిపారు. ఇరగవరం మండలంలోని 21 గ్రామాల నుండి పార్టీ సభ్యులు రేలంగి గ్రామంలో జరిగే మండల మహాసభకు హాజరౌతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఇల్లిందరపర్తి సత్యనారాయణ, జోగి సత్యనారాయణ, జన్ని మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నేత కృష్ణంరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పాలకోడేరు

అన్నదానం చేస్తున్న టిడిపి ముఖ్యనేత కృష్ణంరాజు

శృంగవృక్షం గ్రామానికి చెందిన టిడిపి ముఖ్యనేత కలిదిండి కృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే స్థానిక లెప్రసీ కాలనీలో లెప్రసీ రోగులకు కృష్ణంరాజు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ప్రసాద్‌రాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు నడింపల్లి రామకృష్ణంరాజు (బ్యాంకు బుజ్జి), లక్ష్మణరావు, సతీష్‌రాజు, మంద ప్రవీణ్, బుంగ రమణబాబు, సబ్బితి మోషేను (బుల్లి అబ్బులు), జోగేశ్వరరావు, నరేష్, జడ్డు శ్రీనివాస్, నాగబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

భీమవరం టౌన్: అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులందరికీ ఎపిఎం ఎఫ్ వారి 'గణిత దీప్తి' పదో తరగతి గణిత స్టడీ మెటీరియల్‌ను గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు సౌజన్యంతో ఉచితంగా 45 మంది విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. తెలుగు మోడల్ పేపర్స్ మెటీరియల్‌ను తెలుగు ఉపాధ్యాయులు ఎస్.ప్రేమరాజు సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సుంకర పరమేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.మెర్సీ నిర్మలాకుమారి త్వరలో విద్యార్థులందరికీ ఉచితంగా మెటీరియల్‌ను అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌డివి.ప్రసాద్, ఎంవి.శ్రీలక్ష్మి, డి.అనూరాధ, కె.రాజేష్ కుమార్‌రాజు, జిఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

నరసాపురం: నరసాపురం పురపాలక సంఘంలో పలు అభివృద్ధి పనులు చేపట్టిన గుత్తేదారులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. చేపట్టిన పనులకు 8 నెలలుగా ప్రభుత్వం బిల్లును చెల్లించడం లేదని, సుమారు రూ.6 కోట్లపైనే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని తెలిపారు. ముందుగా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని గుత్తేదారులు నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే మున్సిపల్ మంత్రి నారాయణను కలిసి సమస్యను వివరించాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో అడబాల బాబులు, గోరు సత్తిబాబు, యర్రంశెట్టి పార్థసారధి, శేఖర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

తాడేపల్లిగూడెం: వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడకుండా వారి ఇళ్ల వద్దే పింఛన్లు అందించే బాధ్యత ప్రతి ఉద్యోగి తీసుకోవాలని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ పేర్కొన్నారు. పడాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ సమయంలో సర్వర్ సమస్య వల్ల కొంత ఆలస్యమైనా వెంటనే రాష్ట్ర కోఆర్డినేటర్‌తో చర్చించి సమస్య లేకుండా పింఛన్లు పంపిణీ చేయించారు. మండలంలోని మోదుగగుంట, కొండ్రుప్రోలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్సాకోడేరులో కారు బీభత్సం

రెండు మోటార్ సైకిళ్లను ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్రంగా, మరొకరికి స్వల్ప గాయాలు

పాలకోడేరు : 216 జాతీయ రహదారి విస్సకోడేరులో శుక్రవారం కారు బీభత్సాన్ని సృష్టించింది. అతివేగంతో వచ్చి రెండు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఎస్ఐ ఎం.రవివర్మ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివదేవునిచిక్కాలకు చెందిన పులపర్తి శివకృష్ణ, శృంగవృక్షం గ్రామానికి చెందిన నరసింహారావు గొల్లవానితిప్ప తాపీ పనికి మోటార్ సైకిల్ పై బయలుదేరారు. విస్సాకోడేరు పాల కేంద్రం సమీపానికి వచ్చేసరికి భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న కారు అతివేగంతో మోటర్ సైకిల్‌ను ఢీకొట్టింది. అలాగే భీమవరం వైపు వెళ్తున్న మరో మోటార్ సైకిల్‌ను కూడా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో శివకృష్ణ కుడికాలు, మూడు వేళ్లు విరిగిపోయాయి. నరసింహారావుకు కుడికాలి తొడ ఎముక బయటకొచ్చింది. క్షతగాత్రులను భీమవరం ఇంపీరియల్ హాస్పిటల్‌కి తరలించారు. ఈ ప్రమాదంతో అంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనలో మోటార్ సైకిళ్ల, కారు ఎదుట భాగం నుజ్జునుజ్జయింది. బాధితుడు శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేలకొరిగిన వరిచేను

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

నేలకొరిగిన వరిచేను

కాళ్ల మండల పరిధిలో ఇటీవల కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వరిచేలు నేల కొరిగాయి. పంట కోతకొచ్చిన తరుణంలో అకాలవర్షం, గాలులకు వరిచేలు నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో చేతికొచ్చిన పంటను కోసేందుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి పొలాల్లో నీరు నిలిచి వరిచేను నేలకొరిగిందని, దీంతో కొంత మేరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 3 వేల ఎకరాల్లో సార్వా సాగవుతోంది. కాళ్ల, కాళ్లకూరు, దొడ్డనపూడి, సీసలి, జక్కరం, కోపల్లె, వేంపాడు తదితర గ్రామాల్లో పంట నేలకొరిగింది. దీంతో ధాన్యం తడిసే అవకాశం ఉందని, దిగుబడి తగ్గడంతోపాటు మద్దతు ధర లభించదేమోనని ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచించారు.

మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఆంధ్రుల చరిత్రలో సువర్ణధ్యాయమని భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సరిపిడకల రామారావు అన్నారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్ష కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జానపాటి మధుసూదనరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో సిహెచ్ సత్యనారాయణ, సాగిరాజు సూర్యనారాయణ రాజు, అల్లూరి చిన బంగార్రాజు పాల్గొన్నారు.

భీమవరం : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పలువురు వక్తలు కొనియాడారు. కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసిన ఆంధ్రుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సహాయ సంచాలకులు సంధ్య, మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్ కుక్కల కృష్ణారావు, గుంటపల్లి చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘం మొగల్తూరు గ్రామ అధ్యక్షుడు ఎస్ఎంఆర్.నాగేశ్వరరావు అన్నారు. మొగల్తూరులోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలను శుక్రవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కళ్యాణ మండపం ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలవేసి నివాళు లర్పించారు. సభ్యులు అనంతపల్లి సాయిరామ్, మానేపల్లి చిన్న, సుబ్బారావు, సీమకుర్తి సతీష్, కారుమూరి రాజా పాల్గొన్నారు.

పెనుగొండ: మహనీయుడు పొట్టి శ్రీరాములు అని సర్పంచి నక్కా శ్యామలాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం నివాళు లర్పించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం మున్సిపల్ ఆఫీసులో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు.

ఉచిత గ్యాస్‌ను వినియోగించుకోండి

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల పంపిణీలో కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉండిలో గ్యాస్ :సిలిండర్ పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

పూలపల్లిలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దీపం-2 పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శ్రీకాకుళం జిల్లా నుండి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. సాధారణ పద్ధతిలోనే గ్యాస్ బుక్ చేసుకోవాలని తెలిపారు. 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 4.63 లక్షల ఎల్పిజి లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. దీనికి రూ.117 కోట్లు ఖర్చు అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.4,600 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి గ్యాస్ సిలిండర్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, సివిల్ సప్లై జిల్లా మేనే జరు టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ పాల్గొన్నారు.

ఆచంట: ఎన్నికల హామీల్లో భాగంగా లబ్ధిదారులకు అందజేస్తున్న ఉచిత గ్యాస్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి పొందాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని భీమలాపురం, ఆచంట ఎంపిడిఒ కార్యాలయాల వద్ద లబ్ధిదారులకు దీపం-2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేసామన్నారు. వేములపురం గ్రామంలో కట్టా నిహంత్‌కు సిఎం ఆర్ ఎఫ్ కింద మంజూరైన రూ.8 లక్షల చెక్కును పితాని అందజేశారు. అనంతరం వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు.

సభ నిర్వహణపై అసంతృప్తి...

దీపం-2 పథకంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కార్యక్రమంలో ఆశించిన స్థాయిలో లబ్ధిదారులు హాజరు కాకపోవడంపై ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి గ్యాస్ నిర్వాహకులు నెక్కంటి వేణుగోపాలకృష్ణ, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపిపిలు, నాగరాజు పాల్గొన్నారు.

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉండిలోని శ్రీ శంకర సాయి ఇండియన్ గ్యాస్ కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆర్‌డిఒ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ పథకంలో గ్యాస్ సిలిండర్ పొందిన వారు ముందుగా కంపెనీ ప్రతినిధులకు నగదు చెల్లించాలన్నారు. అనంతరం బాలాజీరావుపేటలోని తాగునీటి చెరువును పరిశీలించి నీరు కలుషితం కాకుండా చెరువు గట్లను బలోపేతం చేయాలని సర్పంచి కమతం సౌజన్య బెన ర్జీకి వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కునుకు రమాదేవి శ్రీనివాస్, గిరిడా రమణ, వీరమల్లు సత్యవతి, టిడిపి మండల అధ్యక్షులు కె.నాగరాజు పాల్గొన్నారు.

తణుకు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మోడీ సహకారంతో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమాన్ని పేద ప్రజలకు అందిస్తోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా హౌసింగ్ బోర్డులో దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేశారు. అనంతరం వినియోగదారుడి ఇంటి వద్దకు సిలిండర్ తీసుకెళ్లి బిగించి అదే గ్యాస్ స్టవ్‌పై టీ కాచి వినియోగదారుడికి, నాయకులకు, అధికారులకు ఎంఎల్ఎ అందజేశారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 88,000 తెల్లరేషన్ కార్డులు ఉంటే ఈ పథకం ద్వారా 68,705 మంది లబ్ధి పొందారన్నారు. మిగిలిన వారు వారి బ్యాంకు ఖాతకు ఇకెవైసి, ఆధార్, ఫోన్ నంబర్ లింకు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులు 68,705 మందికి సంవత్సరానికి రూ.17 కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలకు రూ.85 కోట్లు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఖతీబ్‌కౌసల్ భానో, తహశీల్దార్ డివిఎస్ఎస్ అశోక్‌వర్మ, నేతలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ప్రజల మన్ననలు పొందేందుకే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంఎల్‌శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కడకట్ల ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద శుక్రవారం దీపం పథకం-2 ఉచిత గ్యాస్ పథకం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత వైసిపి ప్రభుత్వ పాలనలో విచ్ఛిన్నమైన వ్యవస్థలన్నింటినీ పునర్జీవం చేసేలా పనిచేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపులు లేకుండా ప్రజల యోగక్షేమాలు చూసేందుకే ప్రాధాన్యతిస్తున్నామన్నారు. అనంతరం ఆయన సమీపంలోని ఓ ఇంటికి వెళ్లి టీ కాచి ఆ ఇంటిలో వారికి తహశీల్దార్‌కు, గ్యాస్ కంపెనీ నిర్వాహకులకు, కూటమి నాయకులకు ఇచ్చారు.కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఆర్‌డిఒ, తహశీల్దార్ పాల్గొన్నారు.

గణపవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందచేసి హామీని నిలబెట్టుకుందని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సపట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం సరిపల్లి ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం దీపం పథకం 2 ప్రారంభించారు. పెరిగిన గ్యాస్ ధరలు వలన మహిళలు పడుతున్నారని అన్నారు ఉచిత గ్యాస్ సిలిండర్ అందచేసి వారికి ఊరట కల్పించే విధంగా ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.అప్పారావు, ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, ఇండియన్ గ్యాస్ డీలర్ శ్రీదేవి, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు తెలుగు మహిళలు, వీరమహిళలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి - తణుకు

తణుకు ఎస్‌సిఐఎం డిగ్రీ కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు తమిళనాడులో జరగనున్న కబడ్డీ పోటీలకు హాజరౌతున్న క్రీడాకారులకు తణుకు రోటరీ క్లబ్ కార్యదర్శి కఠారి సిద్ధార్థ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో రూ.10 వేలు విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె ఫణీంద్ర, రోటరీ అధ్యక్షులు ఆనందం మస్తానరావు, జెఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - తణుకు

తణుకు సాల్వేషన్ ఆర్మీ హాస్టల్ వద్ద విద్యార్థినులకు దీపావళి పండుగ సందర్భంగా వావిలాల సరళాదేవి టపాసులు, బట్టలు పంపిణీ చేశారు. జిల్లా లయన్స్ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా ఉన్న ఇటువంటి విద్యార్థినులకు సేవ చేయడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కొరిపల్లి సత్యనారాయణ, చీకటి శ్రీనివాస్, కామేశ్వరరావు, డి.ప్రసాద్, వావిలాల ప్రసూన పాల్గొన్నారు.

యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి : ఇఒ

భీమవరం టౌన్: కార్తీక మాసం సందర్భంగా యాత్రికులకు పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయ ఇఒ రామకృష్ణంరాజు తెలిపారు. గత ఏడాది కార్తీక మాసంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాత్రికులకు స్వామివారి దర్శనం కల్పించామన్నారు. శని, ఆది సోమవారాల్లో యాత్రికుల తాకిడి ఆలయానికి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నెల రోజులు సుమారు 350000 మందికి పైగా యాత్రికులు ఆలయాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ ఆలయం వద్ద ఎటువంటి తోపులాట జరగకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హైస్కూల్ ఆవరణలో హత్య

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. దీపావళి పండుగ నేపథ్యంలో పాఠశాల ఆవరణలో మూడు రోజులపాటు 32 దీపావళి బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో వ్యక్తి హత్యకు గురైనట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తెలిపారు. మృతుడు సజ్జాపురం 27వ వార్డు ప్రాంతానికి చెందిన కాకర్ల దుర్గారావు(35)గా గుర్తించారు. స్కూల్ ఆవరణలోని ఒక చెట్టుకి బలంగా కొట్టడంతో దుర్గారావు మృతి చెందినట్లు భావిస్తున్నారు. మద్యం మత్తులో ఈ హత్య జరిగిందని భావిస్తున్నారు. తణుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. తణుకు పట్టణ సిఐ కొండయ్య, ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీనివాస్ పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ముద్దాయిలు ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని, కాకర్ల దుర్గారావు కుటుంబానికి న్యాయం చేయాలని దళిత ఐక్యవేదిక అధ్యక్షులు, న్యాయవాది పొట్ల సురేష్ డిమాండ్ చేశారు. దుర్గారావు హత్య వెనుక ఉన్న వారిని శిక్షించాలని డిఎస్‌పి వి.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు.

పింఛను కోసం పడిగాపులు

పలు చోట్ల సర్వర్ల మొరాయింపు ..

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లి గ్రామ సచివాలయం వద్ద వృద్ధులు పెన్షన్ కోసం పడిగాపులు పడుతున్నారు. పూలపల్లి పరిధిలో సుమారు 600 మందికిపైగా పింఛనుదారులు ఉన్నాయి. సుమారు సగం మందికి ఉదయం నుంచి పింఛన్లు మంజూరు చేశారు. సర్వర్లు పనిచేయక మిగతా వారికి పంపిణీ కాలేదు. దీంతో వృద్ధులు సచివాలయ వద్ద ఎదురుచూస్తున్నారు.

పెనుమంట్ర : మార్టేరులోని 12వ వార్డులో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు నరసాపురం పార్లమెంట్ దేవాంగ బిసి సాధికార సమితి కన్వీనర్ ఆర్.భాస్కరరావు తెలిపారు. మండలంలోని పెనుమంట్ర, బ్రాహ్మణచెర్వు, పొలమూరు, ఆలమూరు, ఓడూరు, మల్లిపూడి తదితర గ్రామాల్లో సర్వర్లు మొరాయించడం వల్ల పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది.

పాలకొల్లు : సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం తెల్లవారుజాము నుంచే పట్టణంలో ప్రారంభించారు. పట్టణంలోని 31 వార్డుల్లో 14 మంది సచివాలయం సిబ్బంది పంపిణీ చేశారు. పలుచోట్ల సర్వర్లు మొరాయించాయి. దీంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మున్సిపల్ కమిషనర్ విజయ సారధి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ షురూ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియను ముమ్మరం చేసినట్లు జల వనరుల శాఖ డిఇఇ సిహెచ్ వెంకట నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 31న డివిజన్ పరిధిలోని జల వనరుల శాఖ ఎఇఇ లందరూ సాగునీటి సంఘాల పరిధిలోని భూముల విస్తీర్ణణానికి సంబంధించి సర్వే నంబర్ల వారీగా ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఆయా కార్యాలయాల్లోని సర్వే నంబర్లను నవంబర్ 1, 2, 3 తేదీల్లో అధికారులు ప్రదర్శిస్తారు. వీటికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే 4, 5 తేదీల్లో జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ సర్వే నంబర్ల వారీగా తహశీల్దారు పరిశీలించి 10న తుది జాబితా ప్రదర్శిస్తారు. వాటిపై అభ్యంతరాలు వ్యక్తమైతే ఈ నెల 11, 12న సవరిస్తారు. 13న సాయంత్రం సవరించిన సాగునీటి వినియోగదారుల సంఘాల ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రదర్శిస్తారు. అభ్యంతరాలుంటే 14, 15 తేదీల్లో ఆర్‌డిఒకు ఫిర్యాదు చేసుకోవచ్చు. డివిజన్ పరిధిలో ఇలా నరసాపురం డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాలు 36, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు నిర్దేశించిన సంఘాల పరిధిలో, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, అధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

భవన నిర్మాణ కార్మికుల బతుకులు కూటమి ప్రభుత్వ పాలనలో దయనీయంగా మారాయని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. శుక్రవారం స్థానిక వేల్పూరు గ్రామంలో పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో మల్లికార్జునరావు అధ్యక్షతన యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న నియంత్రత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు నిర్మాణ రంగంలో మెటీరియల్ ధరలు భారీగా పెరిగాయన్నారు. అదేవిధంగా రోజురోజుకూ పెరుగుతున్న ఇసుక సమస్య వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందన్నారు. పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కాపాడుకోవడానికి కార్మికులు ఐక్యమై ఉద్యమించాలని వీరభద్రరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు, దున్నే రుద్ర నాగేశ్వరరావు, నాగ బలరాం, యాతం పెద్దిరాజు, మాధవకృష్ణ, పిల్లి పరమేశ్వరరావు, ఎల్.దుర్గారావు, సోరపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 17ను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నెలవారీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఐదున్నర సంవత్సరాలుగా వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలు ఆగిపోయాయని వాటిని తిరిగి కొనసాగించేలా ప్రభుత్వానికి తెలియపర్చాలని తెలిపారు. దానికి మన కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలిపారు. ఏరియా కోశాధికారి కోడె సాయి బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 11న భీమవరంలో జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే కార్మికులు తమ ఆధార్ జిరాక్స్, వెల్ఫేర్ బోర్డు జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోలి రాతి ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ సీనియర్ నాయకులు అంకం భాస్కర రావు, పాలూరి రాంబాబు మాట్లాడారు.

ప్రకటన

గుండుగొలను కాపురస్తులు శ్రీ తల్లిబోయిన వెంకటన్న గారి భార్య శ్రీమతి వెంకటలక్ష్మి గారు వారి పేరున గల క్రయ దస్తావేజు తేది 24-07-2019 నందు కొనుగోలు చేసిన ఆస్తి తనఖాపై అప్పు తీసుకొనుటకు పిరామిల్ హౌసింగ్ ఫైనాన్స్, ఏలూరు వారిని సంప్రదించినారు. వీరి క్రయ దస్తావేజు తాలూకా లింకు డాక్యుమెంటు అయిన **క్రయ దస్తావేజు నెం.2614/2004 తేదీ 23-06-2004 మార్గమధ్యమున పోయినట్లుగా గుర్తించినారు వారి ప్రయత్నము ఫలించలేదు.** కావున ఈ డాక్యుమెంటు దొరికిన వారు ఇవ్వవలసినదిగా కోరటమయినది. మరియు ఈ తనఖా అప్పు విషయములలో ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో వారం రోజులలోగా తెలియచేయ కోరుచున్నాము.

పి.యస్.చంద్
ఏలూరు, 01-11-24. అడ్వకేట్, ఏలూరు. సెల్: 9440111566

IN THE COURT OF THE Prl. Sr. CIVIL JUDGE, ELURU
FDIA.5/24 in O.S.471/2016

Between:
Pippara Vara lakshmi,
W/o.Venkateswara Rao,
Jangareddygudem
...Petitioner/Plaintiff
R1: Kistarapu Nagamani & 9 Others
Kistarapu Nagamani,
W/o.Koteswara Rao, Easten Street, Eluru.
R3: Peddada Anuradha,
W/o.Sulochanarao, SC Peta,
Rayalam, Bhimavaram.
R4: Srungavruksham Satyavathi,
W/o.Rama Mohanarao (Late),
Sree Rama Nagar, 5th Road,
Gavaravaram, Eluru.
R6: Srungavruksham Kishore kumar,
S/o.Late Rama Mohana Rao, Sree Rama Nagar, 5th Road, Gavaravaram, Eluru.

పై నెంబరు FDIA లో మీరు R1 R3 R4 R6లుగా ఉన్నారు. శ్రీకోర్టు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినను అమలు జరగని కారణంచే శ్రీకోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు.. సదరు వాయిదా **ది.26-11-2024న ఉదయం 10.30 లకు** పైకోర్టు వారి ఎదుట మీరు గాని మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షంగా విచారించబడును.
శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు
Budigina Nagendra Kumar, Advocate,
Jangareddygudem. Cell:9440314862.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.37/2016

బిట్వీన్:
చిటికిన సూర్యచంద్రరావు (డైడ్)
చిటికిన పార్వతి అండ్ అదర్స్
...పిటీషనర్లు /వాదులు
మరియు
వేముల కృష్ణ మూర్తి అండ్ అదర్స్
...రెస్పాండెంట్స్

టు: శ్రీమతి అంగర రాజ్యలక్ష్మి, భర్త: గోవిందు, C/o.తండ్రి: చిటికిన పార్వతి, డో.నెం.8-104/2, గౌడపేట, మోర్త గ్రామం, ఉండ్రాజవరం మండలం, తణుకు పి.జె.సి.జె.

పై నెంబరు గ్రంధములో మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిపర్యాయములు (నోటీసులు) సమన్లు పంపియున్నప్పటికీ మీరు తీసుకోవటం లేదు అని శ్రీ పై కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా ది.04-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కమ్మని ఆర్డరు వేసియున్నారు. మీరు **ది.04-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడరు ద్వారా కాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చుకొనవలెను.** లేని ఎడల మీ పై పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్పుచెప్పబడును.

P.PADMAVATHI
B.SRINIVASA PRASAD
Advocates,
Tadepalligudem, 01-11-2024. Tadepalligudem, Pentapadu.